RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 334 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | గురువారం, 6 జూన్ 2024 | పేజీలు : 4 | వెల : 2/-

# చంద్రబాబు, నితీశ్.. కింగ్ మేకర్స్




## దేశం చూపు బాబు, నితీశ్ వైపు

### కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో కీలకంగా మారిన టీడీపీ, జేడీయూ

### ప్రస్తుతం ఎన్డీయేలోనే రెండు పార్టీలు

### చంద్రబాబుకు ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా ఫోన్

న్యూఢిల్లీ: ఎన్డీయే కూటమిలో టీడీపీ చీఫ్ చంద్రబాబు నాయుడు, జేడీయూ చీఫ్ నితీశ్ కుమార్ కింగ్ మేకర్స్ గా మారారు. ఈసారి బీజేపీకి సొంతంగా మెజార్టీ రాకపోవడంతో ప్రభుత్వ ఏర్పాటులో ఈ రెండు పార్టీలు కీలకంగా మారాయి. లోక్ సభ ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి 293 సీట్లు రాగా, ఇందులో బీజేపీకి సొంతంగా 240 సీట్లు వచ్చాయి. ఇక టీడీపీ 16, జేడీయూ 12 సీట్లు గెలుచుకున్నాయి. ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మ్యాజిక్ ఫిగర్ 272 కాగా, ఎన్డీయే 293 సీట్లతో స్పష్టమైన మెజార్టీ దక్కించుకుంది. అయితే ఇందులో టీడీపీ, జేడీయూ సీట్లు కలిపి 28 ఉన్నాయని, ఈ నేపథ్యంలో ఆ రెండు పార్టీలే కూటమిలో కీలకంగా మారాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. కాగా, 2019 లోక్ సభ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి 352 సీట్లు గెలుచుకుంది. బీజేపీ ఒంటరిగానే 303 సీట్లు దక్కించుకుంది. కానీ ఈసారి బీజేపీ సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేంత మెజార్టీ రాలేదు.

**ఏపీలో కూటమికే 21 సీట్లు..** ఈసారి ఆంధ్రప్రదేశ్ లో లోక్ సభతో పాటు అసెంబ్లీ ఎన్నికలు కూడా జరిగాయి. టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పోటీ చేశాయి. ఈ కూటమి రూలింగ్ పార్టీ వైసీపీని చిత్తు చేసి అధికారాన్ని సొంతం చేసుకుంది. టీడీపీ 135, జనసేన 21, బీజేపీ 8 అసెంబ్లీ సీట్లను దక్కించుకున్నాయి. ఇక లోక్ సభ ఎన్నికల్లోనూ కూటమికే అత్యధిక సీట్లు వచ్చాయి. టీడీపీ 16, జనసేన 2, బీజేపీ 3 సీట్లలో విజయం సాధించాయి. మరోవైపు బిహార్ లో ఎన్డీయే కూటమికి 30 సీట్లు వచ్చాయి. ఇందులో బీజేపీకి 12, జేడీయూకు 12 సీట్లు ఉన్నాయి.

**బీజేపీ హైకమాండ్ అలర్ట్..** ఈసారి బీజేపీకి సొంతంగా మెజార్టీ రాకపోవడంతో ఆ పార్టీ హైకమాండ్ అలర్ట్ అయింది. ఎన్డీయే కూటమిలోని తమ మిత్రులను కాపాడుకునేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నది.

రిజల్ట్ వచ్చిన వెంటనే టీడీపీ చీఫ్ చంద్రబాబుకు ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఫోన్ చేశారు. ఏపీలో కూటమి ఘన విజయం సాధించినందుకు అభినందనలు తెలిపారు.




హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో బుధవారం జోరుగా వర్షం కురిసింది. ఈదురుగాలలు, ఉరుములతో పలు ప్రాంతాల్లో వాన పడింది. దీంతో సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. కోఠి, రాం కోఠి, కింగ్ కోఠి, సుల్తాన్ బజార్, బేగంబజార్, అబిడ్స్, బషీర్ బాగ్, లిబర్టీ, హిమాయత్ నగర్, నారాయణగూడ, గచ్చిబౌలీ సహా పలు ప్రాంతాల్లో వర్షం పడింది. దీంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. వేడి, ఉక్కపోతతో అల్లాడిన నగర ప్రజలు కొంత ఉపశమనం పొందారు.

## బీఆర్ఎస్ సున్నా సీట్లకు కారణమేంటి.. కేసీఆర్, కేటీఆర్ భవిష్యత్ ఏంటి?

# 'పోస్టుమార్టం'




హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో ఊహించని పరిణామాలు చోటుచేసుకున్నాయ్. ఉద్యమ పార్టీగా చెప్పుకునే బీఆర్ఎస్ తన పట్టు కోల్పోతోంది. ఇదే కంటిన్యూ అయితే.. బీఆర్ఎస్ స్థానాన్ని త్వరలోనే బీజేపీ ఆక్రమించే చాన్స్ లేకపోలేదు. గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 4స్థానాలకే పరిమితం కాగా.. ఈ ఎన్నికల్లో ఆ నంబర్ డబుల్ అయింది. ఇదే ఇప్పుడు గులాబీ శ్రేణులను టెన్షన్ పెడుతోంది. బీఆర్ఎస్ పూర్తిగా సున్నాకు పరిమితం కావడం.. చాలా స్థానాల్లో మూడో స్థానంలో నిలవడం మరింత గుబులు రేపుతోంది. తెలంగాణపై ప్రత్యేక దృష్టిసారించిన బీజేపీ.. రాష్ట్రంలో క్రమంగా బలం పెంచుకుంటోంది. రాబోయే నాలుగేళ్లలో కమలం పార్టీ ఇదే హవా కంటిన్యూ చేస్తే.. ఆ ప్రభావం బీఆర్ఎస్ మీద పడే చాన్స్ ఉంది. 2028 ఎన్నికల్లో ఎలా అయినా సరే రాష్ట్రంలో చక్రం తిప్పేందుకు ఇప్పటి నుంచే బీజేపీ ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. ఇదంతా ఎలా ఉన్నా.. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు కనీసం పోటీ కూడా ఇవ్వకపోవడం ప్రతీ ఒక్కరిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్ర నేతలను కాకుండా కేంద్రంలో పార్టీని దృష్టిలో పెట్టుకుని జనాలు ఓట్లు వేస్తారనే వాదన ఉంది. దీంతో రాష్ట్ర పార్టీ అయిన బీఆర్ఎస్ ఖాతా తెరవకపోవడానికి కారణం అయి ఉండొచ్చననే అభిప్రాయాలు వినిపిస్తున్నాయ్. కేసీఆర్ కూతురు, ఎమ్మెల్సీ కవిత లిక్కర్ కేసులో అరెస్ట్ కావడం కూడా.. బీఆర్ఎస్ ఫలితాలపై ప్రభావం చూపించిందన్నది మరికొందరి వాదన. ఇక అటు కవితను జైలు నుంచి విడిపించుకోవడం కోసం బీజేపీతో బీఆర్ఎస్ రహస్య ఒప్పందం చేసుకుందని కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు చేస్తోంది.

ఇదే నిజమైతే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆయన కుమారుడు, మాజీ మంత్రి కేటీఆర్ బీజేపీలో తమ పార్టీని విలీనం చేస్తారా అనే ప్రశ్న అందరిలోనూ వినిపిస్తోంది. బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు పెట్టుకోవడం అనేది జరగదనీ గులాబీ బాస్ గట్టిగానే ఆన్సర్ ఇస్తున్నారు.




# ప్రధాని ప్రమాణానికి చక..చక..ఏర్పాట్లు..!

న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా జరిగిన లోక్ సభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి ఓటర్లు గట్టి షాక్ ఇచ్చారు. గతంలో వచ్చిన 303 సీట్లకు 63 సీట్లు తగ్గి కేవలం 240 సీట్లకే పరిమితమైంది. అంటే మ్యాజిక్ ఫిగర్ 272 సీట్లకు 32 సీట్లు తక్కువ పడ్డాయి. కానీ ఎన్డీయే కూటమిగా 292 సీట్లకే పరిమితమైంది. ఈ కూటమిలో బీజేపీ తర్వాత తెలుగు దేశం పార్టీ 16 సీట్లు గెలుచుకుంది. ఆ తర్వాత జనతా దళ్ యునైటెడ్ పార్టీకి 12 సీట్లు వచ్చాయి. అటు శివసేన ఏక్ నాథ్ షిండేకు 7 సీట్లు.. లోక్ జనశక్తి పార్టీకి 5 సీట్లు.. జనసేన, జనతాదళ్ సెక్యులర్ పార్టీకి చెరో 2 సీట్లు.. రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీకి 2 సీట్లు.. వచ్చాయి. మొత్తంగా ఎన్టీయే కూటమిలో ఇపుడు తెలుగు దేశం పార్టీ రెండో అతిపెద్ద పార్టీగా నిలిచింది. ఈ సారి ప్రజలు బీజేపికి అత్తెసరు సీట్లు ఇవ్వడంతో ఎన్టీయేలోని మిత్ర పక్షాలపై ఆధారపడక తప్పని పరిస్థితి ఏర్పడింది.

రెండు సార్లు అధికారంలో ఉండి ఈ మాత్రం సీట్లు రావడం కూడా ఆశ్చర్యకర విషయమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. పదేళ్ల వ్యతిరేకతను తట్టుకొని నిలబడటం మాములు విషయం కాదంటున్నారు. అంతేకాదు ఈ సారి మిత్రపక్షాల గొంతెమ్మ కోరికలు కూడా బీజేపీకి ఈ సారి సవాల్ గా నిలువనున్నాయి. గత రెండు పర్యాయాలు ఎన్టీయే కూటమిగా అధికారంలో వచ్చినా.. బీజేపీ పార్టీకే సొంతంగా మెజారిటీ మార్క్ సొంతం చేసుకుంది.

దీంతో కొన్ని చట్టాలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా తీసుకురాగలిగింది. కానీ ఈ సారి మాత్రం బీజేపీ 240 సీట్లకు పరిమితం కావడం.. మెజారిటీ మార్క్ కు 32 సీట్లు తక్కువ కావడంతో వీలైనంత తొందరగా నరేంద్ర మోదీ ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయాలనే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం. మరోవైపు రాష్ట్రపతి కూడా దేశంలో ఎక్కువ సీట్లు వచ్చిన పార్టీనే ముందుగా పిలవడం ఆనవాయితీ వస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి బీజేపిని ఆహ్వానించే అవకాశం ఉంది. వీలైనంత తొందరగా ప్రభుత్వ ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉంది. ఈ సందర్భంగా మిగతా పక్షాలను కూడా ఎన్టీయేలో తీసుకొచ్చేందుకు ఇప్పటికే ముమ్మర ప్రయత్నాలు చేసినట్టు సమాచారం.

మరి ఈ సారి నరేంద్ర మోదీ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేస్తే ఎన్డీయే భాగస్వామ్య పక్షాలకు ఏయే పోర్ట్ పోలియోలు ఇవ్వనున్నారనేది ఆసక్తికరంగా మారింది.

# సంపాదకీయం

ప్రభాత
సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## 'ఆరేళ్ళ' నిబంధన అవసరమా!?

ఇప్పటివరకు పిల్లలను మూడేళ్లు నిండితేనే పాఠశాలల్లో చేర్పిస్తున్నారు భారతీయులు. వారి అల్లరి భరించలేకనో.. త్వరంగా జీవితంలో కుదురుకుంటారనో.. మరో కారణంగానో మూడేళ్లు దాటగానే అక్షరాభ్యాసం చేయించి బడికి తోలుతున్నారు. కానీ, మొన్నటివరకు ప్రభుత్వ లెక్కల ప్రకారం ఐదేళ్లు నిండితేనే స్కూల్ కు పంపాలి. ఇకమీదట మాత్రం ఆరేళ్లు పూర్తయితే స్కూల్ బ్యాగ్ భుజాన వేయాలి. కొత్త జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) ఇదే చెబుతోంది. దీంతో ఈ విధానం తీవ్ర చర్చనీయాంశం అయింది. ఎంతవరకు సమంజసం అనే చర్చ మొదలవుతోంది.

**నాలుగేళ్ల కిందటే..** కొత్త జాతీయ విద్యా విధానాన్ని 2020లో మోదీ ప్రభుత్వం తీసుకొచ్చింది. విజ్ఞానం ఆధారిత ప్రపంచంలో అందరికీ నాణ్యమైన విద్య అందించి దేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా నిలపాలనేది దీని ఉద్దేశం. ఇంతకుముందు జాతీయ విద్యా విధానం 1986లో ప్రకటించారు.

1992లో దానికి సవరణ చేశారు. ఇవేవీ ఆశించిన ప్రయోజనాలు అందించలేదంటూ కొత్త పాలసీని తెచ్చారు.

**10 ప్లస్ 2 కాదు.. నాలుగు దశలు..**
ఇప్పటివరకు భారత విద్యా విధానంలో 10o2 పద్ధతి అమల్లో ఉంది. అంటే పదో తరగతి ఆ తర్వాత ఇంటర్. కొత్త విద్యా విధానం మాత్రం 5o3o3o4ను ప్రవేశపెట్టాలని ప్రతిపాదించింది. తొలి అయిదేళ్లు పటిష్ఠమైన పునాది. తర్వాత మూడేళ్లు సన్నాహక, మాధ్యమిక దశలు. చివరి నాలుగేళ్లు సెకండరీ దశలో విద్యాభ్యాసం సాగుతుంది. కాగా, గతంలో కంటే ఇప్పుడు నేర్చుకోవడం సులభమైంది. ప్రభుత్వ ప్రమేయం లేని పాఠశాల పూర్వ దశలోనే పిల్లలు చాలా అంశాలు నేర్చుకుంటున్నారు. దీనికి మూడేళ్లు అక్కర్లేదు. దీంతో తల్లిదండ్రులు పిల్లలను ఐదేళ్లు రాకముందే స్కూళ్లలో చేరుస్తున్నారు. ప్రి స్కూల్ ను రెండు లేదా రెండున్నరేళ్లలోనే పూర్తిచేయిస్తున్నారు. విద్యా హక్కు చట్టం-2009 ప్రకారం.. ఆరేళ్ల నుంచి 14 ఏళ్ల వయసు చిన్నారులందరికీ ఉచిత, నిర్బంధ ప్రాథమిక విద్య అందించాలి. కానీ, ఇప్పటికీ అయిదేళ్లు నిండిన పిల్లలనే ఒకటో తరగతిలో చేర్చుకుంటూ వచ్చారు. ఈ నేపథ్యంలో బాలలకు ఆరేళ్లు నిండిన తరవాతే ఒకటో తరగతిలో చేర్పించాలనే ప్రభుత్వ ఆదేశం శాస్త్రీయంగా, తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా లేదు. అయిదేళ్ల వయసులో చదువుకు అడ్డుపడేదేమీ లేదు. పిల్లలు తమ చుట్టూ ఉన్నదాన్ని గమనించి పరిజ్ఞానం సంపాదించగలరు. కొన్నిసార్లు వారి ఊహా చాతుర్యం పెద్దలను సైతం ఆశ్చర్యపరుస్తుంది. రెండు నుంచి అయిదేళ్ల వయసులో పిల్లలు నర్సరీ స్కూళ్లలో చేరుతున్నారు. తల్లిదండ్రులకు దూరంగా కొత్తవారి మధ్య మసలుతూ లోకజ్ఞానం సంపాదిస్తున్నారు. ఉమ్మడి కుటుంబాలు అదృశ్యమైన ఈ రోజుల్లో భార్యాభర్తలు పట్టణాలు, నగరాల్లో వృత్తి ఉద్యోగాలు చేసుకుంటున్నారు. ఇదివరకటిలా పిల్లలను చూసుకోవడానికి పెద్దలు అందుబాటులో ఉండటం లేదు. లేటు వయసు వివాహాలతో తాము విరమణ పొందే లోపే పిల్లలను ఒక దారిలో పెట్టాలని తల్లిదండ్రులు తొందరపడుతున్నారు. కాబట్టి వీరికి ప్రతి సంవత్సరమూ విలువైనదే. అందుకే ఒకటో తరగతి ప్రవేశానికి ఆరేళ్ల వయోపరిమితి విధించడం సరికాదనే భావన వ్యక్తం అవుతోంది. అందుకనే కొత్త నిబంధనను సరిచేయాలనే డిమాండ్ వస్తోంది.

# నిర్వహణ భారం.. పర్యవేక్షణ కరవు



ఇబ్రహీంపట్నం: రాష్ట్రంలో అడవుల శాతాన్ని పెంచేందుకు గత ప్రభుత్వం హరితహారం పథకాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా ఏటా పట్టణాల్లో, గ్రామాల్లో మొక్కలు నాటుతున్నారు. హరిత హారంతో పచ్చదనంతో పాటు గ్రామస్థులు సేదతీరడానికి ప్రతి గ్రామంలో పల్లె ప్రకృతి వనాలు, మండలానికి అయిదు చొప్పున బృహత్ ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. పల్లె ప్రకృతి, బృహత్ ప్రకృతి వనాలు అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో పిచ్చి మొక్కలు, చెత్తచెదారంతో దర్శనమిస్తున్నాయి.

486 వనాల్లో 50 లక్షల మొక్కలు

జిల్లాలోని ప్రతి మండలానికి 5 చొప్పున బృహత్ ప్రకృతి వనాలు, ప్రతి గ్రామానికి ఒక పల్లె ప్రకృతి వనాన్ని మూడేళ్ల కిందట ఏర్పాటు చేశారు. జిల్లాలో 419 పల్లె ప్రకృతి వనాల్లో సుమారు 7 లక్షల మొక్కలు పెరుగుతున్నాయి. జిల్లాలో 90 బృహత్ ప్రకృతి వనాలను ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 67 బృహత్ ప్రకృతి వనాలను ఏర్పాటు చేయగా అందులో సుమారు 43 లక్షల మొక్కలు పెరుగుతున్నాయి. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ స్థలాల లభ్యతను బట్టి 10 గుంటల నుంచి ఎకరం భూమిలో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. అలాగే 5 ఎకరాల నుంచి పది ఎకరాల వరకు లభ్యతను బట్టి బృహత్ ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. ఆయా వనాల్లో మూడు సంవత్సరాల కిందట పండ్లు, పూలు, నీడనిచ్చె మొక్కలను నాటటడంతో ప్రస్తుతం అవి ఏపుగా పెరిగాయి.

నిర్లక్ష్యానికి గురవుతున్న వనాలు

పచ్చదనం పెంపుతో పాటు ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు ప్రభుత్వం పల్లె ప్రకృతి, బృహత్ వనాలను ఏర్పాటు చేసింది. వనాల్లో ప్రజలు నడక కోసం ట్రాక్, సేద తీరడానికి సిమెంట్ బల్లలను ఏర్పాటు చేశారు. కానీ పల్లె, బృహత్ ప్రకృతి వనాల్లో అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన వనాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. పల్లె, బృహత్ ప్రకృతి వనాల నిర్వహణ బాధ్యతలను మొదటి రెండు సంవత్సరాలు ఉపాధి హామీ పథకం సిబ్బంది చూడగా తర్వాత గ్రామ పంచాయతీలకు అప్పగించారు. జిల్లాలో పలు చోట్ల పల్లె ప్రకృతి వనాలను గ్రామాలకు దూరంగా ఏర్పాటు చేయడంతో ప్రజలకు ఉపయోగపడడం లేదు. అలాగే వనాల గేట్లకు తాళాలు వేసి ఉంటున్నాయి. ఆకులు రాలిపోయి పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా మారాయి. వనాల్లో దీపాలను ఏర్పాటు చేయక పోవడంతో పలు చోట్ల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి.

సంరక్షణ బాధ్యత పంచాయతీలదే - సంపత్‌రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

పల్లె, బృహత్ ప్రకృతి వనాలను ఏర్పాటు చేసిన తర్వాత మొదటి రెండు సంవత్సరాలు నిర్వహణ బాధ్యతను ఉపాధి హామీ పథకం సిబ్బంది తీసుకుంటారు. అనంతరం వనాల నిర్వహణ, మొక్కల సంరక్షణ బాధ్యతలు గ్రామ పంచాయతీలకే ఉంటుంది. పంచాయతీ నిధులతోనే నిర్వహణ చేపట్టాల్సి ఉంటుంది.

# వానాకాలం సాగుకు సిద్ధం



ఎల్లారెడ్డిపేట: గత సంవత్సరం కురిసిన వర్షాలతో యాసంగిలో విస్తారంగా పంటలు సాగయ్యాయి. వరి కోతలు చేపట్టిన రైతులు ఎట్టకేలకు ధాన్యం విక్రయాలను పూర్తిచేశారు. పశుగ్రాసాన్ని సైతం రవాణా చేసి, నిల్వ చేసుకున్నారు. ఈ జూన్‌లో వానాకాలం సీజన్ సాగుకు సిద్ధమవుతున్నారు. నైరుతి రుతుపవనాల పలకరింపునకు ఎదురు చూస్తూనే పొలాలను శుభ్రపరుచుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. చిన్న కమతాలను పెద్దగా తీర్చిదిద్దుకోవడం, వ్యవసాయ క్షేత్రాల్లో పనికిరాని చెట్లను తొలగించుకోవడం తదితర పనులు చేస్తున్నారు. కొన్నిచోట్ల నారుమడుల తయారీకి శ్రీకారం చుడుతున్నారు. ఈ మేరకు ఎరువులు, విత్తనాలను సమకూర్చుకుంటున్నారు. ఎప్పటిలాగే ఈ వానాకాలం సీజన్‌లో అన్నదాతలు వరిపంట సాగుకే మొగ్గు చూపనున్నారు. ఆ తర్వాత పత్తిసాగుకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఈ సీజన్‌లో జీలుగ వంటి పచ్చిరొట్ట ఎరువు విత్తనాలకు భారీగా డిమాండ్ ఏర్పడింది. రాయితీపై తీసుకొచ్చిన జీలుగ విత్తనాలను కమతాల్లో చల్లుకుంటున్నారు. సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచుతున్నారు. మరోవైపు నకిలీ విత్తనాలను అరికట్టేందుకు విత్తన విక్రయ దుకాణాల్లో పోలీసులు, వ్యవసాయశాఖ అధికారులు కలిసి సంయుక్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

18 వేల ఎకరాల్లో వరి...

మెట్ట ప్రాంతమైన ఎల్లారెడ్డిపేట మండలంలో వ్యవసాయానికి బోరుబావులు, బావులు ప్రధాన ఆధారంగా నిలుస్తున్నాయి. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటలు జలకళను సంతరించుకోగా భూగర్భజల మట్టాలు వృద్ధి చెందాయి. చెరువుల నుంచి సాగునీటిని ఆయకట్టు భూములకు విడుదల చేయగా ప్రస్తుతం చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు పడిపోయాయి. యాసంగిలో కొన్ని చోట్ల సాగునీటి కొరతతో వరిపంట ఎండిపోయింది. ఈ నేపథ్యంలో భారీ వర్షాలపైనే అన్నదాతలు ఆశలు పెట్టుకున్నారు. కాగా ఈ ఏడాది వానాకాలం సీజన్ పంటల సాగు ప్రణాళికను అధికారులు రూపొందించారు. ఎల్లారెడ్డిపేట మండలంలో ప్రధానంగా 18 వేల ఎకరాల్లో వరిపంటను సాగుచేయనున్నారు. అలాగే 4500 ఎకరాల్లో పత్తి, 50 ఎకరాల్లో మొక్కజొన్న, 100 ఎకరాల్లో కంది పంటలు సాగవుతాయని అంచనా వేశారు. 4,500 క్వింటాళ్ల వరి, 300 కిలోల కంది, నాలుగు క్వింటాళ్ల మొక్కజొన్న, 11,250 ప్యాకెట్ల పత్తి విత్తనాలు అవసరమవుతాయని గుర్తించారు. అందుకు సరిపడా విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. 60 మిల్లీమీటర్ల వర్షం కురిసిన తర్వాతే విత్తుకోవాలిఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. అవసరం మేరకు విత్తనాలను దిగుమతి చేస్తాం. ఎరువుల అవసరం ఏమేరకు ఉంటుందో నివేదికలు పంపాం. ఎక్కడా విత్తనాలు, ఎరువుల కొరత తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే గ్రామాల్లో రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాం. జీలుగ వంటి పచ్చిరొట్ట ఎరువు విత్తనాలను సరఫరా చేశాం. 60 మిల్లీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైనపుడు మాత్రమే పత్తి విత్తనాలను విత్తుకోవాలి. తొందరపడి వేస్తే మొలక శాతం తగ్గుతుంది. రైతులపై అదనపు భారం పడుతుంది. భూమిరెడ్డి, మండల వ్యవసాయాధికారి, ఎల్లారెడ్డిపేట

# ఏడాదిగా ఎదురుచూపులే!

ఉట్నూరు: ఆదివాసీ గిరిజన విద్యార్థులు చదివే ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలో వసతుల మాటమోగానీ.. పిల్లలకు వడ్డించే భోజన బిల్లుల విడుదలలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోంది. ఏడాదిగా నిధుల విడుదల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. మరికొన్ని రోజుల్లో కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం కానుంది. పాఠశాలల్లో అమలు చేయాల్సిన ఆహార పట్టిక, నిత్యావసర సరకుల పంపిణీకి సంబంధించిన కొత్త కార్యాచరణ ప్రణాళిక కరవైంది. ఉమ్మడి జిల్లాలో సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ఉట్నూరు ఆధీనంలో 134 గిరిజన ఆశ్రమ పాఠశాలలు నడుస్తున్నాయి. వీటిలో చదివే 40,427 మంది ఆదివాసీ గిరిజన విద్యార్థులకు ఉచిత విద్యతో పాటు భోజనం, నివాస వసతిని ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా కల్పిస్తోంది. సర్కారు గిరిజన సంక్షేమ శాఖలకు భోజన ఖర్చుల కోసం బడ్జెట్‌ను విడుదల చేస్తోంది. గిరిజన సహకార సంస్థ(జీసీసీ) ద్వారా ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలకు నిత్యావసర సరకులు, కాస్మెటిక్స్‌ను పంపిణీ చేస్తారు. ప్రభుత్వం విడుదల చేసిన ఆహార పట్టిక ప్రకారం మూడు పూటల భోజనం, సాయంత్రం స్నాక్స్‌ను విద్యార్థులకు అందజేస్తారు.అసలు సమస్య ఇదీ..రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ నుంచి ఐటీడీఏ జిల్లా గిరిజన సంక్షేమ శాఖలకు ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలకు సంబంధించి భోజన ఖర్చులు విడుదల చేస్తారు. వాటిని గిరిజన సహకార సంస్థ(జీసీసీ)కి అందజేసి టెండర్లను నిర్వహించి ఆశ్రమ పాఠశాలలకు అవసరమైన నిత్యావసర సరకులు, కాస్మెటిక్స్‌ను పంపిణీ చేస్తారు. గత విద్యా సంవత్సరానికి సంబంధించి ఉమ్మడి జిల్లాలలోని 134 ఆశ్రమ పాఠశాలలకు సంబంధించిన రూ.20 కోట్లు డైట్ బిల్లుల బకాయిలను ప్రభుత్వం ఇప్పటి వరకు విడుదల చేయలేదు. టెండర్ల ద్వారా నిత్యావసర సరకులు సరఫరా చేసి గుత్తేదారులు బిల్లుల కోసం ఐటీడీఏ చుట్టూ తిరుగుతున్నా.. నిధులు విడుదల కాలేదని అధికారులు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. ఐటీడీఏ పీవో, జిల్లాల గిరిజన సంక్షేమశాఖల అధికారులు పలుమార్లు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా.. ప్రయోజనం లేకుండాపోయిందని అధికారులు వాపోతున్నారు. గతేడాది బకాయిలు చెల్లించనిదే కొత్త విద్యాసంవత్సరంలో సరకులు సరఫరా చేయడం కష్టమని జీసీసీ సంస్థ నిస్సహాయత వ్యక్తం చేస్తోంది.

కొత్తగా ఏం చేద్దాం!బిల్లులు విడుదల కాకపోవడంతో కొత్త విద్యాసంవత్సరంలో ఆహార పట్టిక అమలుపై ఏం చేయాలో తేల్చుకోలేక ఐటీడీఏ గిరిజన సంక్షేమ శాఖల అధికారులు మల్లగుల్లాలు పడతున్నారు. పాత బకాయిలు విడుదల చేస్తారా లేక నిత్యావసర సరకులను పంపిణీ చేస్తారా తెలియక సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు. కొత్త విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఎదురయ్యే భోజన సమస్యలను పూర్తిస్థాయిలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని జిల్లా గిరిజన సంక్షేమ శాఖల అధికారులు పేర్కొంటున్నారు. బకాయిలు విడుదల సమస్యను వారికి వివరించామన్నారు. కొత్త ప్రణాళికపై వారిచ్చే ఆదేశాలను అమలు చేస్తామంటున్నారు.

# నలుదిక్కులా పచ్చందాలు

నర్సాపూర్: వేసవిలో ఓ వైపు ఎండలు మండుతుండగా.. నర్సాపూర్ పురపాలక సంఘం అధికారులు మొక్కలు నాటి సంరక్షించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో నర్సాపూర్- తూప్రాన్- మెదక్- హైదరాబాద్- సంగారెడ్డి మార్గాల్లో పచ్చందాలు కనువిందు చేయనున్నాయి. రాయరావు చెరువు కట్టపై పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఇవి సందర్శకులను ఎంతో ఆకట్టుకుంటున్నాయి.

ప్రత్యేక ప్రణాళికతో... వర్షాలు ప్రారంభం కాకముందే మొక్కలు నాటుతున్నారు. ఎండాకాలంలో నాటినవి బతికితే వాటికి తిరుగుండదని భావిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. పురపాలిక పరిధిలో ప్రత్యేకంగా నర్సరీ లేకున్నా బయటి మార్కెట్లో కొని తీసుకొచ్చి నాటి సంరక్షిస్తున్నారు. పుర పరిధిలోని 15 వార్డుల్లో నాటుతున్నారు. వేసవిలో వాటి రక్షణకు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో కొంత పచ్చదనం పెరిగిందని అంటున్నారు.పలు మార్గాల్లో... పట్టణం మీదుగా వెళుతున్న మెదక్- హైదరాబాద్(765-డి)తోపాటు సంగారెడ్డి- తూప్రాన్ జాతీయ రహదారికి ఇరువైపులా మొక్కలు నాటిస్తున్నారు. రోజూ ఉ




దయం, సాయంత్రం మొక్కలకు ట్యాంకర్లతో నీరందిస్తున్నారు. ఇందుకోసం ఓ అధికారికి బాధ్యతలు అప్పగించారు. 50వేల మొక్కలు ఇళ్లకు పంపిణీ చేయడంతోపాటు 24వేలు రహదారుల వెంట నాటాలని నిర్ణయించారు. అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా 9 రకాలున్నాయి.

కంటికి రెప్పలా కాపాడుతున్నాం..
- అశోక్‌గౌడ్, పురపాలిక అధ్యక్షుడు

పురపాలిక సమావేశంలో చర్చించి నిర్ణయించిన మేరకు పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట మొక్కలు నాటాలని నిర్ణయించాం. ఈ మేరకు మొక్కలు నాటడానికి ప్రణాళికలు రూపొందించుకున్నాం. ఇంతవరకు నాటిన మొక్కలతో మంచి ఫలితాలు వస్తున్నాయి. భవిష్యత్తులో మహా వృక్షాలుగా మారుతాయి.

# ఖాళీలతో పట్టు సాధ్యమెలా?

కొత్తకోట : పట్టు పురుగుల పెంపకం, మల్బరీ తోటల సాగుకు కేంద్ర ప్రభుత్వం పలు రాయితీ పథకాలను అమలు చేస్తోంది. వీటిని రైతుల చెంతకు తీసుకెళ్లి, అమలు చేసేలా చూసేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది కొరతతో ఏటా సాగు లక్ష్యం నెరవేరడం లేదు. ఏడాదికేడాది పట్టు పురుగుల పెంపకం, మల్బరీ సాగు చేస్తున్న వారి సంఖ్య తగ్గిపోతోంది. ఏటా ఉమ్మడి జిల్లాలో పట్టు సాగు పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నా ఫలితం లేదు. ప్రస్తుతం పట్టు పరిశ్రమ శాఖలో పని చేస్తున్న అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించడంతో పూర్తి స్థాయిలో సేవలందడం లేదు. ఇప్పటికైన ప్రభుత్వం ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటే వ్యవసాయంతో పాటు పట్టు వైపు రైతులు ముందడుగు వేసేందుకు అవకాశం ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో వివిధ విభాగాల్లో మొత్తం 78 పోస్టులున్నాయి. ఇందులో కేవలం 7 పోస్టులకు మాత్రమే అధికారులు ఉన్నారు. మిగతా 71 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి.మహబూబ్‌నగర్‌లో 32 పోస్టులకు డీడీ, ఇద్దరు పట్టుపరిశ్రమ శాఖ అధికారులు, సహాయ సాంకేతిక నిపుణుడు, ఎల్‌డీ టైపిస్టు పోస్టు మాత్రమే భర్తీ చేశారు. మిగతా 27 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

వనపర్తి జిల్లాలో 14 పోస్టులకు 1 కాపలాదారుడితో పాటు వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాకు సంబంధించి ఒక అధికారి పోస్టు భర్తీ చేశారు. ఇక్కడ 13 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

జోగులాంబ గద్వాల జిల్లాలో 19 పోస్టులకు సహాయ పట్టుపరిశ్రమ శాఖ అధికారి మాత్రమే ఉన్నారు. ఇక్కడ మిగతా 18 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలో 14 పోస్టులకు సాంకేతిక సహాయ కుడు మాత్రమే ఉన్నారు. మిగతా 13 పోస్టులను భర్తీ చేయలేదు.



నారాయణపేట జిల్లాకు ఇప్పటి వరకు పట్టుపరిశ్రమ శాఖకు ఒక్క పోస్టు కూడా మంజూరు కాలేదు. వికారాబాద్ జిల్లాకు చెందిన అధికారిణి నారాయణపేట జిల్లాకు ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ప్రతిపాదనలు పంపిచాం

ఉమ్మడి జిల్లాలో పట్టుపరిశ్రమ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. పోస్టులు భర్తీ చేస్తే జిల్లాకు కావాల్సిన అధికారులను, సిబ్బందిని కేటాయిస్తారు. మరోమా రు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తా.లక్ష్మయ్య, పట్టుపరిశ్రమ శాఖ డీడీ, మహబూబ్‌నగర్.

# ఆహార పరిశ్రమలతో అతివలకు అండ

గద్వాల ప్రజలకు కల్తీ లేని శుద్ధమైన ఆహారం అందించడం.. పంటలు పండించే రైతులకు, పొదుపు సంఘాల మహిళలకు ఆదాయ కల్పనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఫుడ్‌ప్రాసెసింగ్, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ద్వారా పీఎమ్ఎఫ్ఎమ్ఈ (ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ మైక్రో ఫుడ్ ప్రాసిసింగ్ ఎంటర్‌ప్రైజెస్) పథకాన్ని అమలు చేస్తోంది. ఇదే తరహాలో రాష్ట్ర ప్రభుత్వం ఆహారశుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం స్థానిక వనరులకు తగ్గట్లుగా ఒక్కో జిల్లాలో ఒక్కో రకమైన పరిశ్రమలను నెలకొల్పాలని నిర్ణయించింది. ఇప్పటికే ఆయా జిల్లాల సెర్ప్ అధికారుల నుంచి వివరాలు సేకరించి, ప్రభుత్వానికి నివేదించారు. పరిశ్రమల ఏర్పాటుతో ఉమ్మడి జిల్లాలోని అతివలకు ఆర్థిక తోడ్పాటు లభించనుందని అధికారులు భావిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో యూనిట్ల ఏర్పాటు : ఉమ్మడి జిల్లాలో 36,286 స్వయం సహాయక సంఘాలు ఉండగా, వీటిలో 5.44 లక్షల మంది మహిళలు సభ్యత్వం కలిగి ఉన్నారు. వీరిలో ఆసక్తి ఉన్న మహిళలను గుర్తించి పీఎమ్ఎఫ్ఎమ్ఈ పథకం ద్వారా ఏటా ఆహార శుద్ధి యూనిట్ల ఏర్పాటు చర్యలు తీసుకుంటున్నారు. ప్రధానంగా కారం, పసుపు, పప్పు మిల్లులు, పాల పదార్థాల ఉత్పత్తి, చిరుధాన్యాలు, నూనె తయారీ, చిన్న రైస్ మిల్లులు, అప్పడాలు, పచ్చళ్ల తయారీ తదితర యూనిట్ల ఏర్పాటుకు అవకాశం కల్పించారు. అయితే..ఇది పూర్తి స్థాయిలో నెరవేరడం లేదు. ఏటా 60 నుంచి 70 శాతం యూనిట్ల ఏర్పాటే జరుగుతోంది. ఇందులో 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను జోగులాంబ గద్వాల జిల్లాలోనే తీసుకుంటే.. 62 యూనిట్లను నెలకొల్పడం లక్ష్యంగా ఉండగా, 42 యూనిట్లను మాత్రమే ఏర్పాటు చేశారు. వీటిని పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయడంతో పాటు, ప్రతి జిల్లాలోనూ ఆహారశుద్ధి పరిశ్రమలను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ద్వారా ఎక్కువ మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.



## డబుల్ ఇంజిన్ ఎందుకు మొరాయించింది..?

భాజపా తరచూ చెప్పే డబుల్ ఇంజిన్ సర్కారుకు మోడల్ యూపీ. ఇక్కడ మోదీ–యోగి ద్వయం రాష్ట్రాన్ని ముందుకుతీసుకెళుతోందని పేర్కొంటారు. శాంతిభద్రతలు, అభివృద్ధి, హిందుత్వ అజెండాతో ముందుకెళుతున్నామని కమలం పార్టీ ప్రచారంలో చెప్పుకొంది. కానీ, ఈసారి ఎన్నికల్లో డబుల్ ఇంజిన్ మొరాయించి ఫలితాలు ఇవ్వలేదు. తప్పు ఎక్కడ జరిగిందనే అంశంపై ఇప్పుడు కమలనాథుల్లో అంతర్మథనం మొదలైంది. మరోవైపు సమాజ్‌వాదీ పార్టీ బలమైన సోషల్ ఇంజినీరింగ్‌తో ఈసారి ఎన్నికలకు సిద్ధమైంది. ఈ క్రమంలో 'పీడీఏ' (వెనుకబడిన, మైనార్టీ, దళిత్) వ్యూహంతో ఆ వర్గాల ఓటర్లను ఆకర్షించింది. రాష్ట్రంలో నాలుగు ఎన్నికల్లో విజయానికి యోగి నేతృత్వం వహించారు. 2022 అసెంబ్లీ, 2019 లోక్‌సభ, రెండు స్థానికసంస్థల ఎన్నికలు ఈ జాబితాలో ఉన్నాయి. వీటిల్లో భాజపా విజయాలు సాధించింది. ఈసారి టికెట్ల కేటాయింపుల్లో అభ్యర్థులపై స్థానిక వ్యతిరేకతను పరిగణనలోకి తీసుకోలేదనే విమర్శలూ ఉన్నాయి. రాష్ట్రంలో పార్టీ ఓటమికి అదే బలమైన కారణంగా నిలిచింది. యోగి ఆదిత్యనాథ్ మాత్రం టికెట్ల కేటాయింపును పూర్తిగా కేంద్ర నాయకత్వానికే వదిలేసినట్లు తెలుస్తోంది. కాకపోతే ప్రచార బాధ్యత యోగి తీసుకొన్నారు. ఆయన రాష్ట్రంలో, బయట 170 ర్యాలీలు నిర్వహించడంతోపాటు.. రాష్ట్రంలోని 75 జిల్లాల్లో పర్యటించారు.

**యోగిపై ప్రచారాన్ని బలంగా కౌంటర్ చేయలేకపోవడం..** భాజపా అభిమానుల్లో ఇష్టమైన సీఎంగా యోగికి పేరుంది. ఈ క్రమంలో పార్టీలో గందరగోళం సృష్టించేందుకు ప్రత్యర్థులు చేసిన ప్రయత్నాలను బలంగా తిప్పికొట్టలేకపోవడం కూడా సీట్లు కోల్పోవడానికి కారణమైంది. ఎన్నికల మధ్యలో దిల్లీ సీఎం లఖ్‌నవూ వచ్చిన వేళ.. 'భాజపా గెలిచిన తర్వాత.. యోగిని కూడా ఇతర సీఎంల్లానే తొలగిస్తుంది' అని పేర్కొన్నారు. మీరు కాషాయదళానికి ఓటేస్తే మీ అభిమాన ముఖ్యమంత్రిని వదులుకొంటారు అంటూ ప్రచారం జరిగింది. ఇది పార్టీ శ్రేణుల్లో గందరగోళానికి దారితీసింది. దీనికి భాజపా నుంచి గట్టి కౌంటర్ రాలేదు. ఇది కూడా కొంత నష్టం చేకూర్చిందని నాయకత్వం భావిస్తోంది.

**స్థానిక అంశాలు..** రైతులపై ఆర్థిక ఒత్తిడి, ద్రవ్యోల్బణం, నిరుద్యోగ సమస్య, అగ్నివీర్‌పై ప్రతిపక్ష ప్రచారం వంటి అంశాలను చాలాచోట్ల భాజపాకు వ్యతిరేకతను తెచ్చాయి.

**మైనార్టీ ఓట్ల ఏకీకరణ..** యూపీలో ఈసారి మైనార్టీ ఓట్లు గంపగుత్తగా ప్రతిపక్ష పార్టీలకు పడ్డట్లు ట్రెండ్స్ చెబుతున్నాయి. సుమారు 85 శాతం ముస్లింలు కాంగ్రెస్–సమాజ్‌వాదీ పార్టీకి ఓటు వేయగా.. ఆరు శాతం మాత్రమే భాజపా వైపు ఉన్నారు. దీనికి ప్రతిగా తమకు మద్దతున్న వర్గాల ఓట్లను ఏకీకరణ చేయడంలో భాజపా విఫలమైంది.

**అయోధ్యలోనే ఓటమి..** రామాలయం నిర్మించిన అయోధ్యలో భాజపా ఓడిపోవడాన్ని పార్టీ జీర్ణించుకోలేకపోతోంది. భాజపాకు జీవం పోసిన అయోధ్య ఉద్యమానికి ఓ సానుకూల ముగింపు ఇచ్చినా.. ఎస్పీ అభ్యర్థి అవధేష్ ప్రసాద్‌నే విజయం వరించింది. దీంతో ఈ అంశం తమకు ఎన్నికల్లో ఉపయోగపడలేదని పార్టీ అంచనా వేసింది.

**మాయావతి బలహీన పడటం..** యూపీలో బీఎస్పీ బలహీనపడటం కూడా కాంగ్రెస్–సమాజ్‌వాదీకి కలిసొచ్చింది. 2014లో బీఎస్పీకి సీట్లు రాకపోయినా.. 2019లో పుంజుకొని 10 చోట్ల విజయం సాధించింది. అప్పట్లో సమాజ్‌వాదీ పార్టీతో జట్టు కట్టింది. కానీ, ఈసారి సొంతంగా బరిలో నిలవడంతో గతంలో వచ్చిన 19 శాతం ఓట్లను నిలబెట్టుకోలేక సింగిల్ డిజిట్‌కు పరిమితమైంది. రిజర్వేషన్ల అంశాన్ని కాంగ్రెస్–సమాజ్‌వాదీ బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాయి. ఫలితంగా బీఎస్పీ ఓట్లు వాటికి మళ్లాయి. దీంతో రాష్ట్రంలో ఇండియా కూటమి ఓట్లశాతం 40శాతానికి చేరింది.

## తెలంగాణలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం భాజపానే: ఈటల



హైదరాబాద్: తెలంగాణలో అధికార కాంగ్రెస్‌కు భాజపానే ప్రత్యామ్నాయం అని ఓటర్లు తీర్పునిచ్చారని మల్కాజిగిరి ఎంపీగా గెలుపొందిన ఈటల రాజేందర్ అన్నారు. హైదరాబాద్‌లోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.."లోక్‌సభ ఎన్నికల్లో యావత్ తెలంగాణ ప్రజానీకం అంతా మోదీ మూడోసారి ప్రధాని కావాలని భాజపాకు ఓటేశారు. భాజపా అభ్యర్థులను నిండు మనసుతో ఆశీర్వదించినందుకు కృతజ్ఞతలు. అసెంబ్లీ ఎన్నికల కంటే లోక్‌సభ ఎన్నికల్లో భాజపా ఓటు బ్యాంకు 35 శాతానికి పెరిగింది. మల్కాజిగిరి నా సీటు, మహబూబ్‌నగర్ నా సొంత నియోజకవర్గమని విర్రవీగిన రేవంత్‌రెడ్డికి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్ర సహాయ సహకారాలను తీసుకుంటాం. రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతను విస్మరిస్తే.. వెంటపడి పని చేయిస్తాం. నెహ్రూ తర్వాత మోదీ మూడోసారి ప్రధాని కాబోతున్న నేతగా చరిత్రలో నిలిచిపోతారు. ఖమ్మం, మహబూబాబాద్ తప్ప అన్ని చోట్లా రెండో స్థానంలో ఉన్నాం. ప్రజలు కాంగ్రెస్ వైపు ఉంటే మల్కాజిగిరి, మహబూబ్‌నగర్‌లో ఎందుకు గెలవలేదో రేవంత్‌రెడ్డి చెప్పాలి. ఇండియా కూటమి అధికారం చేపడుతుందని వెకిలి మాటలు మాట్లాడుతున్నారు. భాజపాతో పొత్తు పెట్టుకొని చంద్రబాబు ఎన్నికల్లో పోటీ చేశారు. చంద్రబాబు, నీతీశ్‌ను కలుస్తామని అర్థంలేని మాటలు మాట్లాడుతున్నారు. కేంద్రంలో ఐదేళ్లు సంపూర్ణంగా సంకీర్ణ ప్రభుత్వం ఉంటుంది. తెలంగాణలో పేదవాడికి సొంత ఇల్లు కట్టించడం మా బాధ్యత" అని ఈటల అన్నారు.

## గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సంప్రదాయాన్ని కొనసాగిస్తాం: సంతోష్ కుమార్



హైదరాబాద్ : గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సంప్రదాయాన్ని కొనసాగిస్తామని రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్‌కుమార్ తెలిపారు. బుధవారం సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి గ్రామంలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో పాల్గొని బాదం, సీతాఫలం మొక్కలు నాటార. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పచ్చదనం, ఆరోగ్యకర వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ పుట్టిన రోజులతో పాటు వివిధ సందర్భాల్లో మొక్కలు నాటాలన్నారు. పర్యావరణ పరిరక్షణపైనే మానవాళి మనుగడ ఆధారపడి ఉంటుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సహ వ్యవస్థాపకుడు రాఘవ, మాజీ సివిల్ సప్లయ్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస రెడ్డి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.


ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్

9440977660, 9110718194




## భారత్‌తో మరింత బలమైన బంధం

## భారత్‌తో మరింత బలమైన బంధం.. మోదీకి దేశాధినేతల శుభాకాంక్షలు

దిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధించిన నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ప్రపంచవ్యాప్తం గా పలువురు దేశాధినేతలు శుభాకాంక్షలు తెలియజేశారు. భారత ప్రజల శ్రేయస్సుకు ఆయన కృషి చేస్తారని విశ్వాసం వ్యక్తంచేశారు. మోదీ నేతృత్వంలోని భారత్‌తో సత్సంబంధాలు కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. సార్వత్రిక ఎన్నికల్లో భాజపా 240 స్థానాల్లో గెలిచింది. దేశంలోకెల్లా ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించింది. కాంగ్రెస్ 99 చోట్ల విజయం సాధించింది. ఆ పార్టీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన 272 సీట్లను సాధించింది. ఈ నేపథ్యంలో తెదేపా, జేడీయూ సహా ఇతర మిత్రపక్షాలతో కలిసి కేంద్రంలో భాజపా మళ్లీ అధికార పగ్గాలు చేపట్టేందుకు సిద్ధమైంది. "2024 భారత సార్వత్రిక ఎన్నికల్లో వరుసగా మూడోసారి విజయం సాధించిన ప్రధానమంత్రి మోదీ, భాజపా, ఎన్డీయే కూటమికి అభినందనలు. భారత్, మాల్దీవుల ప్రజల శ్రేయస్సు, ప్రయోజనాల కోసం కలిసి పనిచేసేందుకు మేం సిద్ధంగా ఉన్నాం" **– మహమ్మద్ ముయిజ్జు, మాల్దీవుల అధ్యక్షుడు**

"ఎన్నికల విజయంపై మోదీకి అభినందనలు. ప్రజాశ్రేయస్సు కోసం పాటుపడుతున్న మీకు శుభాకాంక్షలు. ఇటలీ, భారత్ బంధాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తాం. ఇరు దేశాలు, ప్రజల శ్రేయస్సు కోసం సహకారంతో ముందుకెళ్తాం"**– జార్జియా మెలోనీ, ఇటలీ అధ్యక్షురాలు**

"భాజపా నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు. ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో సాధించిన పురోగతి, శ్రేయస్సుపై ప్రజలు విశ్వాసముంచారు. పొరుగుదేశంగా భారత్‌తో బంధాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు శ్రీలంక ఎదురుచూస్తోంది" **– రణిల్ విక్రమ సింఘే, శ్రీలంక అధ్యక్షుడు**

"మూడోసారి చరిత్రాత్మక విజయం సాధించినందుకు ప్రధాని మోదీకి అభినందనలు. మీ నాయకత్వంలో అతిపెద్ద ప్రజాస్వామ్యం అద్భుతమైన పురోగతిని సాధిస్తూనే ఉంటుంది. మారిషస్ – భారత్ ప్రత్యేక సంబంధాలు చిరకాలం కొనసాగాలి" **–ప్రవింద్ కుమార్, మారిషస్ ప్రధాని**

"లోక్‌సభ ఎన్నికల్లో భాజపా, ఎన్డీయే వరుసగా మూడోసారి విజయం సాధించినందుకు ప్రధాని నరేంద్రమోదీకి అభినందనలు. భారత ప్రజల ఉత్సాహభరితమైన భాగస్వామ్యంతో ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య కసరత్తు విజయవంతంగా పూర్తయినందుకు సంతోషిస్తున్నాం" – ప్రచండ, నేపాల్ ప్రధాని "చరిత్రాత్మకంగా వరుసగా మూడోసారి విజయం సాధించిన నా మిత్రుడు ప్రధాని నరేంద్రమోదీ, ఎన్డీయేకి శుభాకాంక్షలు. ఉన్నత శిఖరాలకు ఎదుగుతున్న భారత్‌తో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం" **– షెరింగ్ తోబ్గే, భూటాన్ ప్రధాని**

## భాజపా అభ్యర్థుల విజయానికి కేసీఆరే కృషి చేశారు: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: తెలంగాణలో వంద రోజుల్లో గ్యారంటీలను అమలు చేశామని టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన నచ్చితే ఓటు వేయాలని లోక్‌సభ ఎన్నికల్లో కోరామని.. 8 మంది తమ అభ్యర్థులు గెలిచారని చెప్పారు. వందరోజుల పాలన తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్‌కు 41 శాతం ఓట్లు వచ్చాయన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు. "అసెంబ్లీ ఓట్ల శాతం కంటే ఎక్కువగా లోక్‌సభ ఎన్నికల్లో వచ్చాయి. కాంగ్రెస్ పరిపాలన పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని మేం భావిస్తున్నాం. 8 మంది ఎంపీలను గెలిపించి ఆశీర్వదించారు. కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలకు కృతజ్ఞతలు. 2019 ఎన్నికల్లో మాకు 3 సీట్లు వస్తే.. ఇప్పుడు ఆ సంఖ్య 8కి చేరింది. భారాస ఏడు సీట్లలో డిపాజిట్లు కోల్పోయింది.

ఆ 7 సీట్లలో భాజపాను గెలిపించి అవయవదానం చేశారు. భారాస నుంచి బలహీన అభ్యర్థులను పెట్టి భాజపా నేతల గెలుపు కోసం కేసీఆర్ కృషి చేశారు. మెదక్‌లో కాషాయ పార్టీ విజయానికి హరీశ్‌రావు సహకారం అందించారు." అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## గులాబీ పార్టీ అధ్యాయం ముగిసింది.. బై బై బీఆర్ఎస్



హైదరాబాద్: బై బై బీఆర్ఎస్ అంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు. నాలుగు నెలలకే రెఫరెండం అని ప్రజల్లోకి వెళ్లి ఓటు శాతం పెంచుకున్నామన్నారు. బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానం గెలుచుకోవడం సంతోషంగా ఉందన్నారు. బీఆర్ఎస్ నేతలు ఆవేదనలో, బాధలో ఉన్నారన్నారు. కేసీఆర్ బస్సు ఎక్కి తిరిగినా డిపాజిట్లు కూడా రాలేదన్నారు. బీఆర్ఎస్ అధ్యాయం ముగిసిందని.. కేసీఆర్ తన పార్టీ క్లోజ్ చేసుకుంటే మంచిదన్నారు. ఈ రిజల్ట్‌తో మాలో ఆత్మ విశ్వాసం పెరిగిందన్నారు. ఇకపై ఏ ఎన్నికలు వచ్చినా మా టీమ్ లీడర్ రేవంత్ నాయకత్వంలో క్లీన్ స్వీప్ చేస్తామన్నారు. 15 ఏళ్లు అధికారంలో తామే ఉంటామని కోమటిరెడ్డి వెల్లడించారు.

## కేంద్రమంత్రి పదవిపై అరుణ హాట్ కామెంట్స్



మహబూబ్‌నగర్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించిన మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానంలో బీజేపీ అభ్యర్థి డీకే అరుణ సంచలన విజయం కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. వంశీచందర్ రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగారు. ఆయనపై డీకే అరుణ(3,510) ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఈరోజు(బుధవారం) మీడియాతో డీకే అరుణ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగాసీఎం రేవంత్‌రెడ్డికు డీకే అరుణ కౌంటర్ ఇచ్చారు. సొంత నియోజకవర్గం మహబూబ్‌నగర్ నుముఖ్యమంత్రి రేవంత్ గెలిపించుకోలేకపోయారని ఎద్దేవా చేశారు. కేంద్రమంత్రి పదవి కోసం తాను ప్రయత్నాలు చేయనని.. పార్టీ నిర్ణయం తీసుకుంటోందని తెలిపారు. ముఖ్యమంత్రి పదవికి రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని సొంత పార్టీ నుంచే డిమాండ్ వస్తోందని చెప్పారు. నల్లగొండ, భువనగిరిని గెలిపించిన ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి బ్రదర్స్ నుంచి రేవంత్ కు ఇబ్బంది తప్పదని హెచ్చరించారు. ప్రధానిగా ఉండకూడదని చెప్పడానికి రేవంత్ ఎవరు? అని ప్రశ్నించారు. 14స్థానాలు గెలుస్తామని.. కాంగ్రెస్ 8స్థానాలే గెలవటంపై రేవంత్ ఏమంటారు? అని నిలదీశారు. రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రిగా ప్రజలు గుర్తించటం లేదని అన్నారు.

రేవంత్ రెడ్డి తన భాషను మార్చుకోకుంటే ఇబ్బంది పడతారని డీకే అరుణ పేర్కొన్నారు.

## నాడు టీఆర్ఎస్.. నేడు బీజేపీలో.. – 'కొండా'ను వరించిన విజయం



హైదరాబాద్: 2014లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో నాడు టీఆర్ఎస్ పార్టీ నుంచి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఘన విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో 'కొండా'కు 4,35,077 ఓట్లు రాగా ప్రత్యర్థి పటోళ్ల కార్తీక్‌రెడ్డిపై 73,023 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేశారు. టీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిపై పోటీ చేసి 14,317 ఓట్ల తేడాతో ఓటమి చెందారు. తిరిగి 2024 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిపై ఘన విజయం సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి 6,36509 ఓట్లు రాగా బీజేపీ అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డికి 8,09,528 ఓట్లు వచ్చాయి.

రంజిత్‌రెడ్డిపై 1,72,897 మెజార్టీ సాధించారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని బీజేపీ పార్టీకి ఒక సిట్టింగ్ ఎమ్మెల్యే కూడ లేకుండానే బీజేపీ విజయదుందుభి మోగించింది. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం స్థానం ఏర్పడ్డాక మొదటి సారిగా హస్తం కైవసం చేసుకగా, 2014, 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికలో బీఆర్ఎస్ విజయం సాధించింది. తొలిసారిగా చేవెళ్ల పార్లమెంట్ స్థానంపై కమలం వికసించింది. తిరుగు లేని నేతగా నిలిచారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660